క్లుప్తంగా

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో అమ్మవారు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూల పెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జాము నుంచే మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు మొక్కు చెల్లింపులో భాగంగా గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు సమర్పించి అభిషేకాలు చేసి హారతులు పట్టారు.

కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): భవన నిర్మాణ కార్మిక సంఘం నంద్యాల జిల్లా నూతన కమిటీని ఆదివారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బాలరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు నిధులు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం 44 లేబర్ చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లుగా విభజించి కార్మిక హక్కులను హరిస్తుందని మండిపడ్డారు. మృతి చెందిన కార్మికులకు రూ.10లక్షలు బీమా చెల్లించాలని కోరారు. నంద్యాల అధ్యక్షుడిగా అజీజ్, ఉపాధ్యక్షుడిగా ఫరూక్ ఖాజా, ప్రధాన కార్యదర్శిగా మాబాషా, సహాయ కార్యదర్శిగా శంకర్, మాబుల్, కోశాధికారిగా చాంద్, నూర్ బాషాతో పాటు 13 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

అనుమానితులపై సమాచారమివ్వండి


ఏకలవ్య నగర్ వాసులతో మాట్లాడుతున్న త్రీటౌన్ సీఐ నరసింహులు

బొమ్మలసత్రం: నంద్యాల త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని త్రీటౌన్ సీఐ నరసింహులు తెలిపారు. ఆదివారం స్థానిక ఏకలవ్యనగర్ ప్రాంతంలో సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ సరైన ధృవపత్రాలు లేని 14 వాహనాలు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ముఖ్యంగా అనుమానితులు, రౌడీషీటర్లు, పాతనేరస్తుల ఇళ్లలో తనిఖీలు చేపట్టామని చెప్పారు. జూన్ 4వ తేదిన జరిగే కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అల్లర్లు చేయరాదని సూచించారు. ఎస్ఐ ధనమ్మ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు కృషి



మాట్లాడుతున్న రెమీష్‌షేక్

నంద్యాల(వ్యవసాయం): విద్యార్థుల్లో నైతిక విలువలు పొందించేందుకు స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా కృషి చేస్తుందని ఎస్ఐఓ జాతీయ అధ్యక్షుడు బ్రదర్ రెమీష్ షేక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో విద్యార్థులతో ఎస్ఐఓ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించగా, ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రోషన్ జమీర్ మాట్లాడుతూ యువ శక్తి మనదేశ సంపత్తి అని, యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉత్తమ పౌరులుగా దేశం పునః నిర్మాణంలో పాల్గొనాలని కోరారు. మౌలానా ఇదాందుల్లా, నూర్ అహమ్మద్ మదానీ, అబ్దుల్‌సమ్మద్, మహమ్మద్ అబులైజ్ పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు ఆశ్రయం కల్పించొద్దు


లాడ్జీల నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డి

బొమ్మలసత్రం: నంద్యాల సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న లాడ్జీలు, ఫంక్షన్‌హాల్‌లో కొత్త వారికి, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారికి ఆశ్రయం కల్పించవద్దని డీఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డి సూచించారు. ఆదివారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో లాడ్జీ, ఫంక్షన్ హాళ్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ జూన్ 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అన్ని డార్మెటరీలపై నిఘా ఉంచామని చెప్పారు. కొత్తవారు లాడ్జీల్లోకి ప్రవేశించేటప్పుడు పూర్తి వివరాలు తెలుకోవాలని చెప్పారు. విద్య, విధుల్లో భాగంగా, ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన వారిని మాత్రమే లాడ్జీల్లోకి అనుమతించాలని కోరారు. బె బెట్టింగ్ , మద్యం సేవిస్తూ లాడ్జీల్లో బస చేసే వారిపై వెంటనే తమకు సమాచారం అందించాలని ఆదేశించారు. సీఐలు రాజారెడ్డి, నరసింహులు, దస్తగిరిబాబు, ఎస్ఐ నవీన్ పాల్గొన్నారు.

పుడమికి జీవం

- పశువుల ఎరువుతో నేల సారవంతం
- గ్రామాల్లోని పశువుల ఎరువుకు డిమాండ్
- పొలాల్లో గొర్రెలు, మేకలను నిలుపుతున్న రైతులు
- వాటి వ్యర్థాలతో పొలాలకు సత్తువ
- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి
- తగ్గనున్న పంటల సాగు వ్యయం


భీమవరం వద్ద పొలంలో ఎరువు చల్లుతున్న రైతు

నంద్యాల(అర్బన్): వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం పెరిగిపోవడంతో నేలలోని పోషకాల నిల్వల్లో సమతుల్యం లోపించి ఉత్పాదకత తగ్గుతోంది. చీడపీడలు ఆశించడం, సూక్ష్మ పోషకాల లోపాలతో దిగుబడులు తగ్గుతున్నాయి. ఈ సమస్యను అధిగమించాలంటే సేంద్రియ పద్ధతులను పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పేర్కొంటున్నారు. పశువులు, మేకలు, గొర్రెల ఎరువు పంటల సాగులో ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇది సేంద్రియ ఎరువులతో సమానం. దీన్ని దుక్కులు దున్నడానికి ముందే పంట భూముల్లో వేసి దున్నితే చాలా మంచిది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడానికి వీలవుతుంది. దుక్కులు దున్నిన తర్వాత పశువుల పేడ మొత్తం భూమిలోకి వెళ్లి పంట దిగుబడిని పెంచడానికి దోహదపడుతుంది. పంట ఎదుగుదల, మొక్కలు బలంగా ఉండేందుకు పశువుల ఎరువు ఉపయోగపడుతుంది. ఎకరాకు నాలుగు నుంచి ఐదు ట్రాక్టర్ల పశువుల ఎరువును వినియోగించాలి.

భూసారం పదిలం...

సాధారణంగా రైతులు వేసవిలో పశువుల ఎరువును వ్యవసాయ పొలాలకు తరలిస్తుంటారు. అదే సమయంలో ఎండలు ఎక్కువగా ఉంటాయి. అధిక ఎండల కారణంగా పొలంలో జల్లితే వాటిలో ఉన్న పోషకాలు ఆవిరవుతాయి. కాబట్టి పశువుల పేడను పొలంలో కుప్పలు పోసుకోవాలి. భూమిలో తగు తేమ ఉన్న సమయంలోనే వెదజల్లి వెంటనే దుక్కిలో కలియదున్నాలి. దీని వల్ల భూసారం పెరుగుతుంది, సహజసిద్ధమైన లక్షణాలు అందుతాయి. నేలలోని ఆమ్లత్వం, క్షారత్వం, నీటిని నిల్వ ఉంచే గుణాన్ని అదుపుచేసి పోషకాలు మొక్కలకు అందేలా సహాయపడతాయి. దీంతో రైతులు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చు.

ఇతర రాష్ట్రాలకు ఎరువు తరలింపు..

పశువుల ఎరువుతో అధిక పంట దిగుబడులను గుర్తించిన కర్ణాటక, తమిళనాడు, తెలంగాణకు రాష్ట్రాలకు చెందిన రైతులు నంద్యాల జిల్లాలో పాడి రైతులు నిల్వ చేసిన ఎరువును తీసుకెళ్తున్నారు. టన్నుల ప్రకారం ఎరువును కొనుగోలు చేసి తీసుకెళ్తుండటంతో నంద్యాల జిల్లా పాడి రైతులకు ఇదోరకమైన జీవనోపాధిగా మారింది. కేవలం పశువుల పేడ టన్ను రూ.2వేల నుంచి రూ.2.200 వరకు ఉంటుంది. అలాగే పొట్టు కూడినదైతే టన్ను రూ.1700 నుంచి రూ.రూ.2వేల వరు పలుకుతోంది. ట్రాక్టర్ ఎరువు రూ.6వేల ప్రకారం అమ్ముతున్నారు.

ఇలా దున్నాలి..

పొలాన్ని ఎలా పడితే అలా దున్నడం వల్ల పంటలకు నష్టం వాటిల్లుతుంది. రైతులు వేసవి కాలంలో మెట్ట భూములను వానా కాలంలో సీజన్ కోసం సన్నద్ధం చేస్తుంటారు. మెట్ట ప్రాంతాల్లో భూమి వాలుకు అడ్డంగా దుక్కి చేయాలి. ఎందు కంటే వేసవిలో వచ్చే అధిక వర్షాలకు ఎంతో సారవంతమైన మట్టి కొట్టుకుపోతుంది. వాలుకు అడ్డంగా దుక్కి దున్నితే నీటి ప్రవాహం తగ్గి మట్టి కొట్టుకుపోకుండా ఉంటుంది.


రైతునగరం ఫోర్‌లైన్ వద్ద కర్ణాటకకు తరలించేందుకు లారీలో లోడ్ చేసిన ఎరువు

పశువుల ఎరువుతో భూసారం పెంపు

పశువులు, మేకలు, గొర్రెల ఎరువు వేయడం వల్ల భూసారం పెరుగుతుంది. సహజసిద్ధమైన లక్షణాలు అందుతాయి. నేలలోని నీటిని నిల్వ ఉంచే గుణాన్ని అదుపుచేసి పోషకాలను మొక్కలకు అందేలా సహాయపడతాయి, రైతులు తక్కు ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో పశు సంపద ఆశించిన స్థాయిలో ఉంది. వాటి ఎరువును పొలాల్లో వేస్తే రసాయన ఎరువుల వినియోగం బాగా తగ్గుతుంది. ఇక గొర్రెలు, మేకలు నిలపడం వల్ల నేల సారవంతమవుతుంది. అలాగే వాటి మూత్రం ద్వారా నత్రజని స్థాయి పెరుగుతుంది. వీటిని నిలపడం వల్ల యూనియా వినియోగం తగ్గుతుంది. పశువుల ఎరువులో నత్రజని, భాస్వరం, పొటాషియం ఉంటాయి.

– రాజశేఖర్, ఏడీఏ, నంద్యాల


కానాల వద్ద పొలంలో ఆపిన గొర్రెల మంద

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పాణ్యం: ఈనెల 22వ తేదీన పాణ్యంలో వ్యక్తి అదృశ్యం కావడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్ ఆదివారం తెలిపారు. వివరాలు.. హైదరాబాద్ పట్టణం అసిస్ నగర్‌కు చెందిన వి.శంకర్ (74), పసుపులేటి శ్రీనివాసులు మద్యం మానుకునేందుకు పాణ్యంలో ఉన్న సుంకులా పరమేశ్వరి అలయం వద్దకు ఈనెల 22వ తేదీ వచ్చారు. ఆలయంలో ఇచ్చే తాయత్తు, తీర్థం స్వీకరించి అక్కడే విశ్రాంతి తీసుకున్నారు. కొద్దిసేపటికే వి.శంకర్ కనిపించకుండా పోయాడన్నారు. శంకర్ కుమారుడు సునీల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అదృశ్యమైన వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా అమ్మవారి జాతర


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట గ్రామంలో వెలసిన శ్రీ నిదానంపాటి లక్ష్మీబాలత్రిపురసుందరి అమ్మవారి జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మహిళలు ఉపవాసాలతో మొక్కులు చెల్లించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి పూజలు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భీమనాయక్, పీఠాధిపతి సోమశేఖర్‌నాయక్, భజన సంఘం సభ్యులు తదితరుల పాల్గొన్నారు.

జోరుగా వేసవి సేద్యపు పనులు

- గత పంట వ్యర్థాల తొలగింపు
- ఖరీఫ్‌నకు సమాయాత్తం అవుతున్న రైతులు


అరకతో ఒట్టి సేద్యం చేస్తున్న రైతన్న


పారకతో పంట వ్యర్థాలను ఊడుస్తున్న కూలీలు

దొర్నిపాడు: ముందస్తు వర్షాలతో రైతన్నలు ఖరీఫ్‌నకు సమాయాత్తం అవుతున్నారు. సాగుకు ముందు చేపట్టాల్సిన సేద్యం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఓ వైపు రైతులు అరకతో ఒట్టి సేద్యాలు చేస్తుంటే, మరో వైపు మహిళా కూలీలు గత పంట వ్యర్థాలను పారకతో ఊడుస్తున్నారు. చాలా మంది రైతులు ఇప్పటికే రెట్టింపు కౌలు చెల్లించి పొలాలను గుత్తకు తీసుకుంటున్నారు. ముఖ్యంగా పత్తి, మిరప పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. కేసీ, కుందూ నది కింద వరి పంట సాగు చేయనున్నారు.

ఆహారాన్వేషణ


క్రిష్టిపాడులోని పొలాల్లో నిలిచిన నీటిలో పురుగుల కోసం కొంగల వేట

దొర్నిపాడు: వర్షాభావ పరిస్థితులతో జలాశయాలు ఎండిపోవడంతో పక్షులకు ఆహారం కరువైంది. ముఖ్యంగా కొంగలకు చేపలే ప్రధాన ఆహారం. అయితే ఎక్కడా నీరు లేకపోవడంతో చేపలు లభించడం గగనమైంది. ఇక వ్యవసాయ పనులు అంతంత మాత్రంగానే ఉండటంతో పొలాల్లో పురుగులు దొరకడం లేదు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడక్కడా గుంతలు, పొలాల్లోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ చేరింది. దీంతో కొంగలు గుంపులుగా వచ్చి ఆహారాన్వేషణ గావిస్తున్నాయి. సమీపంలోని చెట్లపై ఆవాసం ఉంటూ ఆకలి తీర్చుకోవడానికి గుంపులుగా కుంటలపై వాలిపోతున్నాయి.

నోట్ బుక్కులు, పాఠ్యపుస్తకాల మంజూరు


చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో నోట్ బుక్స్‌ను అన్‌లోడింగ్ చేస్తున్న కూలీలు

చాగలమర్రి: 2024–2025 విద్యా సంవత్సరానికి సంబంధించి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు అవసరమైన 30,986 నోట్ పుస్తకాలు చాగలమర్రికి చేరుకున్నట్లు ఎంఈఓలు అనురాధ, సయ్యద్ న్యామతుల్లా తెలిపారు. అలాగే 1వ తరగతి ఇంగ్లిష్, తెలుగు మీడియం, 2వ తరగతికి ఇంగ్లిష్, తెలుగు మీడియం ఇంగ్లిష్ రీడర్, వర్క్ బుక్, మ్యాథ్స్ సెం-1, మాథ్స్ వర్కు బుక్ సెం-1, తెలుగు రీడర్, తెలుగు రీడర్ వర్క్ బుక్, 6వ తరగతికి ఇంగ్లీష్, తెలుగు మీడియం మ్యాథ్స్, తెలుగు రీడర్, ఉర్దూ మీడియం 2వ తరగతికి ఉర్దూ రీడర్, 3వ తరగతికి ఉర్దూ రీడర్, మాథ్స్ వర్క్ బుక్, 4వ తరగతికి ఉర్దూ ఈవీఎస్ వర్క్ బుక్, ఉర్దూ రీడర్, 6, 7వ తరగతులకు ఉర్దూ రీడర్ పాఠ్య పుస్తకాలు మొత్తం 6,348 మండలానికి కర్నూలు నుంచి వచ్చినట్లు ఆదివారం చెప్పారు. అలాగే మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 6–10వ తరగతి విద్యార్థులకు 30,986 నోట్ పుస్తకాలు మంజూరు చేశారని, ఈ పుస్తకాలను జూన్ 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభమైన తరువాత విద్యార్థులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

వేలం వాయిదా

శిరివెళ్ల: ఈ నెల 27వ తేదీ నుంచి మండలంలో జరగవలసిన ఆలయాల మాన్యం కౌలు బహిరంగ వేలాలను వాయిదా వేసినట్లు కోటపాడు గ్రూప్ ఆలయాల ఈఓ వేణునాథరెడ్డి ఆదివారం తెలిపారు. 27న చెన్నూరు, శిరివెళ్ల, 29 నకామినేనిపల్లె బోయలకుంట్ల, జూన్ 1వ తేదీన కోటపాడు ఆలయాల భూముల కౌలుకు బహిరంగ వేలం జరగాల్సి ఉందన్నారు. తదుపరి వేలం ఎప్పుడు జరుగుతుందనేది త్వరలో తెలియజేస్తామన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పొన్నాపురం 19వ వార్డులో ఇమ్మానియేల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేసినట్లు ఫౌండర్, చైర్మన్ ప్రభు ఇమ్మానియేల్, రత్న ఇమ్మానియేల్ ఆదివారం తెలిపారు.

మైసూరమ్మకు బోనాల సమర్పణ


ప్రత్యేక అలంకరణలో పూజలందుకుంటున్న అమ్మవారు

కోవెలకుంట్ల: మండలంలోని కంపమల్ల గ్రామంలో వెలసిన మహిషాసురమర్దినిదేవి(మైసూరమ్మ)కి ఆదివారం భక్తులు బోనాలు సమర్పించారు. గ్రామ సర్పంచ్ లోకేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, గ్రామ నాయకులు బాలీశ్వరరెడ్డి, సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులు బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆయా కాలనీలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా రథోత్సవం

అవుకు: మండల కేంద్రం అవుకులో తిరుకళ్యాణ మహోత్సవాల్లో భాగంగా శ్రీ భూలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి రథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అవుకు రాజవంశీయులు త్రివిక్రమవర్మ, అవుకు ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, ఉపసర్పంచ్ చల్లా రఘునాథ్ రెడ్డి, ఉత్సవ మూర్తులకు పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. తేరువీధి నుంచి రాజా వీధి మీదుగా మండపం వీధి వరకు రథోత్సవం కనుల పండువగా సాగింది.

విద్యార్థులు సనాతన ధర్మాన్ని పాటించాలి


విద్యార్థికి పుస్తకాలు అందజేస్తున్న డాక్టర్ శివప్రసాద్


విద్యార్థినికి పురస్కారం అందజేస్తున్న పద్మశాలీయ సంఘం నాయకులు

నంద్యాల(వ్యవసాయం): విద్యార్థులు చదువుతో పాటు సనాతన ధర్మంపై అవగాహన పెంచుకొని పాటించాలని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి అంకాలజిస్ట్ డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ కార్తీక పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బైటిపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో మనఊరు, మన గుడి–మనబాధ్యత ఆధ్వర్యంలో ఇటీవల పదవ తరగతి ఉత్తీర్ణులైన 120మంది విద్యార్థులకు వేద ఆశీర్వచనంతో పాటు నోట్ పుస్తకాలు అందజేశారు. నిర్వాహకులు శివకుమార్‌రెడ్డి, డాక్టర్ భార్గవవర్ధన్ రెడ్డి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో..

ఇటీవల పదవ తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన పద్మశాలీయ విద్యార్థులకు ఆదివారం శ్రీ భద్రావతి భావనారుషి దేవాలయ కల్యాణ మండపంలో ప్రతిభకు పట్టాభిషేకం అనే కార్యక్రమం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు భీమునిపల్లె వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ 85మంది పదవ తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు వరుసగా రూ.10వేలు, రూ.7500, రూ.5వేలు, కన్సోలేషన్ బహుమతి కింద ప్రతి ఒక్కరికీ రూ.2వేలు, ప్రశంసా పత్రాలు, మెమొంటోలు అందజేశామని చెప్పారు. లక్ష్మీనారాయణ, గాజుల శంకర్, వేణు, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, బ్రహ్మానందం , వెంకటరామయ్య, కౌన్సిలర్ పురందర్ పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు


రుద్రవరంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ షర్ఫుద్దీన్

రుద్రవరం: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలుబడనున్న నేపథ్యంలో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ షర్ఫుద్దీన్ హెచ్చరించారు. మండలకేంద్రంలో ఆదివారం సబ్‌డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, పోలీస్ బలగాలతో కార్డెన్ సెర్చ్ చేపట్టి అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిశాల సెంటర్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలుబడున్నాయని, గ్రామాల నుంచి లెక్కింపు కేంద్రాల వద్దకు వెళ్లవద్దని సూచించారు. 144 సెక్షన్, 30యాక్ట్ అమలులో ఉందని, ప్రజలు గుంపులుగా ఉండరాదన్నారు. ఫలితాలు వెలువడగానే విజయోత్సవాలు చేసుకోరాదని, అందరూ శాంతియుతంగా ఉండాలని చెప్పారు. గ్రామాల్లో అనుమానిమాత వ్యక్తులు సంచరిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులు సమాచారం ఇవ్వాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ధ్రువపత్రాలు లేని 10 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐలు చంద్రబాబు, హనుమంతు నాయక్, ఎస్ఐలు నిరంజన్‌రెడ్డి, సురేష్, రామాంజనేయరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

పంట మార్పిడితో ప్రయోజనం

- ఒకేరకమైన పంట సాగుతో నష్టం
- వేర్వేరు పంటలతో రైతులకు, పొలాలకు లాభదాయకం
- చీడపీడల నుంచి రక్షణ


కేసీ కెనాల్ కింద పచ్చిరొట్ట సాగు చేసిన దృశ్యం (ఫైల్)

గోస్పాడు: ఈఏడాది ముందస్తుగా వర్షాలు పడుతుండటంతో పాటు ఖరీఫ్ సీజన్‌కు సమయం ఆసన్నం కావడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. అయితే మండలంలో చాలా మంది రైతులు ఏటా ఒకే రకమైన పంట సాగు చేస్తున్నారు. దీంతో భూ సారం తగ్గి పెట్టుబడులు పెరగడంతోపాటు దిగబడులు ఏటేటా పడిపోతున్నాయి. ఏటా ఒకే రకం పంటలను సాగు చేయకుండా వేర్వేరు పైర్లను ఒక క్రమంలో వేసేలా దృష్టిసారించాలని ప్రభుత్వం, వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.


యాళ్లూరు వద్ద పొలంలో సేద్యం చేస్తున్న రైతు

పైర్ల మార్పిడితో రైతులకు ప్రయోజనం

రైతులు ప్రతిఏడాది ఒకేరకమైన పైర్లను సాగుచేయకుండా పైర్ల మార్పిడి పద్ధతిని అనుసరించాలి. ఒకసారి వేసిన పైరు తిరిగి వేయడం వల్ల పొలాల్లో భూసారం తగ్గే అవకాశం ఉంది. పంటమార్పిడిపై రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. పచ్చిరొట్టపైర్ల సాగుతో కూడా భూసారం పెరుగుతుంది. వీటికోసం రైతులకు సబ్సిడీ కింద జీలుగలు అందిస్తున్నాం.

–స్వప్నికారెడ్డి, ఏఓ, గోస్పాడు

ఇలా సాగు చేద్దాం..

- మొక్కజొన్న వేసిన పొలంలో మిరప పంట సాగు చేయకుండా ఉంటే మంచిది. ఒకవేళ మిరప పంట సాగుచేస్తే నష్టం తప్ప లాభాలు వచ్చే అవకాశం లేదు. పత్తి వేసిన పొలంలో మిరప పంట సాగుచేస్తే లాభసాటిగా ఉంటుంది.
- వరి పంట తర్వాత పప్పుధాన్యాల పంటలు, నూనెగింజల పంటలను సాగుచేయడం ద్వారా వరికి తెగుళ్లు ఆశించకుండా ఉంటాయి.
- మిరప పంట వేసిన పొలంలో పత్తి పంట సాగు చేస్తే పెట్టుబడులు తగ్గడంతో పాటు దిగుబడులు కూడా పెరిగే అవకాశాలు ఎక్కువ . మిరప పంట సాగుచేయడానికి ముందు భూమిలో జొన్న, పిల్లిపెసర వంటి పంటను సాగుచేసి దాన్ని ట్రాక్టర్ ద్వారా తొక్కించి పంట సాగుచేస్తే భూసారం పెరిగి చీడపీడలు దరిచేరవు.
- నులిపురుగులు ఉన్న ప్రాంతాల్లో టమాటా, బెండ, పెసర, మినుము పంటలు వేస్తే అవి వాటిని మరింత అభివృద్ధి చేస్తాయి.
- పంట మార్పిడిలో భాగంగా నేలంతా పూర్తిగా కప్పే పంటలను ఎంపిక చేసుకోవాలి.
- వేరుశనగ, పెసర, మినుము పంటలను వేయడంతో నేలను పూర్తిగా కప్పి ఉంచుతాయి. దీనివల్ల కలుపు మొక్కలు అధికంగా రాకుండా ఉంటాయి.
- భూమిలో తేమ ఎక్కువ కాలం నిల్వ చేసే శక్తి ఉన్నప్పుడు ఏడాదిలో రెండు పంటలు పండించుకునే అవకాశం ఉంటుంది.
- తేలికపాటి నేలలు, ఎర్ర, ఇసుక, తువ్వ నేలల్లో మిశ్రమ పంటలను సాగుచేసుకోవచ్చు.

విద్యతో పాటు కళలను ప్రోత్సహించాలి


విద్యార్థినుల సాంస్కృతిక నృత్య ప్రదర్శన


జ్యోతి ప్రజ్వలన చేసి ముగింపు ఉత్సవాలను ప్రారంభిస్తున్న రామకృష్ణారెడ్డి

నంద్యాల(వ్యవసాయం): తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యతో పాటు కళలు, లలిత కళలు, క్రీడలపైన దృష్టి సారించి వారి అభివృద్ధికి తోడ్పడాలని రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి స్థానిక మున్సిపల్ టౌన్ హాల్‌లో కళారాధన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కళాసాధన 2024 ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కళారాధన సంస్థ 23 సంవత్సరాలుగా లయన్స్‌క్లబ్, ఐఎంఏ, రోటరీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వడం గొప్ప విషయమన్నారు. ముగింపు కార్యక్రమాన్ని జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. పిల్లల నైపుణ్యాలను వెలికి తీయడానికి నెల రోజులుగా వారికి నేర్పించడం ఎంతో సాహసోపేతమైందన్నారు. రిటైర్డు జిల్లా విద్యాశాఖ అధికారి గుర్రాల రామకృష్ణయ్య వార్షిక పురస్కారాలను అందజేశారు. బాలరత్న ప్రతిభా పురస్కారం, సరయూ, యువరత్నా ప్రతిభా పురస్కారాలు అందజేసి సత్కరించారు. అనంతరం విద్యార్థుల శాస్త్రీయ సంగీతం, శాస్త్రీయ నృత్యం, ఆధునిక నృత్యం, సినీ లలిత గానాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అలాగే నెల పాటు శిక్షణ ఇచ్చిన కోచ్‌లకు మెమెంటో, ప్రశంసా పత్రాలను అందజేశారు. కళారాధన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మధుసూదనరావు, డాక్టర్ రవికృష్ణ, శివకుమార్‌నాయుడు, రంగనాథ్, చంద్రమోహన్, తదితర లయన్స్, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.